# మగని చెవిలో—

"అనసూయ"

(మొక్కులగురించి.)

పిల్లలకు మొక్కులు తీర్చాలి, ఎప్పుడేమిటి బయలుదేరుదాం? అవి తీర్చకుండా అశ్రద్ధచేస్తూ ఉండబట్టేవాళ్లకు యిలాగు వదలకుండా ఏదో ఒక చికాకుచేస్తూనే ఉంది. పిల్లలతో బయలుదేరితే సంరక్షణకు ఎవరని అంటారా? కావలస్తే మా అమ్మను రమ్మంటాను. మా అమ్మవస్తే మరి మనకు పిల్లలపూచీయే అక్కర్లేదు. వంటా పెంటా అంతా అదేచేసిపెడుతుంది. దానిదగ్గర పిల్లలకుకూడా యెంతో చేరిక. దానికికూడా యేదో మొక్కు ఉన్నాదిట, ఆ వెట్టికూడా తీరిపోతుంది!

ఇందరికి డబ్బు పెట్టుకోలేరూ? మీకూ మీ పిల్లలకూ మీ పెళ్లాముకూ టిక్కెట్లు మీరే పెట్టుకుంటారు గదా! ఇకను ఎటువచ్చీ మా అమ్మనా మీకు బరువు! అంత బరువైపోతే నేనే యేదైనా బంగారం అమ్మిపెట్టుకుంటాను లెండి! పోనీ యేం పైదా? మీకు తల్లివంటిది! దానినేం ఉచితముగా ఒక్కర్తెనీ పంపించి యాత్రలు చేయించమని మిమ్మలిని కోరేనా యేమిటి! మీ పిల్లలను యెత్తుకొని వంటలూ వార్పులూ చేసి చేతులూ మూతులూ కడిగి కూలిపని చేసినందుకు టిక్కెట్లు కొన్నానని మీరు అనుకోకూడదు? పోనీ, ధర్మంచేసేనని అనుకోరాదూ? ధర్మమా! ధర్మానికంటే మీ మనస్సొప్పదే! డబ్బులేకపోతే ధర్మమేమిటా! నేననేసరికి డబ్బులేని ఘోష వస్తుంది. ధర్మమంటే దానమంటే. యాత్రంటే నోమంటే ప్రాక్టీసులేదనీ, సొమ్ములేదనీ, క్లుప్తముగా కాలక్షేపముచేయాలనీ, డిప్రెషను రోజులనీ, శ్రీరంగనీతులు మొదలుపెడతారు! కాఫీలకి పది పదిహేను రూపాయిలు అయిపోతున్నాయి నెలకు—అది మానగలిగేమా? పిల్లలచేతనైనా మానిపించగలిగేమా? నిన్నను మీ క్లబ్బువాడు వచ్చేడు. మీరేమో బిలియర్డు ఆటబాపతు పదిహేను రూపాయిలు క్లబ్బుకు యివ్వాలట, అడిగేడు. నిజమేనా? 'ఎప్పటిదో పాతబాకీ'యూ? ఎప్పటిదో పాతబాకీకాదు. సరి కొత్తదేనట? నేను కనుక్కోకపోలేదు! అరవయ్యోయేట అగ్గిగండమని ఆ ఆట మీకెందు కిప్పుడు? చిన్నపిల్లల్లాగు ఏమిటా ఆటలు? మీరు చిన్నవాడిని అనే అంటారా! మీకు ముప్పయినూరోయేడు, ఇంకా మీకు చిన్నతనమా? మీకు ముగ్గురు చిన్నవాళ్లు గదా, ఇంకా చిన్నవాళ్లేనా మీరు? పోనీ, ఆట ఆనుకున్నా యేదో డబ్బు ఖర్చుకాని ఆటలాడితే బాగున్నాది గాని నెలకి యిదో పదిహేనురూపాయిలా! ఈ పేకాటా ఈ గోట్టికాయలాటా మీ గాంధి ఆడమనిచెప్పేడా? ఆ క్లబ్బుకే పోనే

963

డానికి డబ్బుఉందా? యాత్రకంటే లేదూ? మీ ఖర్చులకన్నింటికీ డబ్బులోపము వుండదు. నేను యీ పండుగకి ఆ పండుగ, ఒకచీర అడిగినా; వెళ్లక వెళ్లక యేదో యాత్ర వెళదామన్నా, 'పొదుపుగా ఉండాలి, పొందికగా ఉండాలి' అని నీతికథలు వెళ్లబోస్తారు!

పోనీయండిగాని, అంత డబ్బులోపమైతే అప్పు చేసి రెండువందల రూపాయీలు యెందు కాతాలూకాబోర్డు వోట్లకు తగలబెట్టేరు? ఇంతా చేసి గలిచేరు, ఏమిటిలాభం? ఆ ఖర్చుపెట్టినది మరికొంచెం భారీగాచేసి జిల్లాబోర్డు మెంబరుకే ప్రయత్నం చేయలేకపోయేరూ? దానివల్ల యేమిలాభమూ? ఏమిలాభమో మీకు తెలియదా యేమిటి, లోకమల్లా కోడై కూస్తూవుంటే? బడ్డుబాబులు, పొట్టచీరితే అక్షరం లేనివాళ్లు, వందలూ వేలూ సంపాదించినారట తమ వోట్లకు!

అది నఖారాపనా? మీ ప్లీడరీపనికన్న నఖారాయేమిటి? అబద్ధాలాడడం కాదు, అబద్ధాలాడించడం కాదు, ఒకడికొంప తీయడం కాదు; ఒప్పన్నప్రకారం ఫీజుపుచ్చుకున్నారు, ఓటిచ్చేరు! దానిలో తప్పేమిటి, నఖారాయేమిటి? చుట్టకంపు నాయిళ్లని నక్కచిక్కుల పట్నాయిళ్లని నాలుగేళ్లు ప్రాణం పుచ్చుకున్నా, రాతిని నారలాగినట్లు లాగినా, రాసంతసొమ్ము, అరమినీటుపనికి హాయిగా దొరుకుతూఉంటే మానేసి వెర్రిమొగం వేసుకొని కూర్చుంటే మాత్రం మీరు సత్యహరిశ్చంద్రుల్లు అయిపోతారా? కళ్లజోడువాడట! వోటిచ్చినచ్చేడు; వాడుంచుకొన్న కరణపుది మొన్నను గజ్జెలవడ్డాణం పెట్టుకొని తిరుగుతున్నది! మచ్చలమొగంవాడి గర్వం భూమీ ఆకాశమూకూడాపట్టలేదుట గదూ! అది వోట్లడబ్బువల్లనేనా? లేక వాళ్లేం మరోమోస్తరుగా యీ నాలుగురోజులలోనూ ఆర్జించేసేరా? అంచేత వోటుకి లంచము పుచ్చుకోవడము నీచమూ హైన్యమూ యెట్లయిందో చెప్పండీ? నేను చెప్పిన మాటకి సమాధానం చెప్పరేం? పట్టుమని పదిరూపాయిలు ఫీజిస్తే, అయినది కాదనీ, కానిది ఔననీ, రాసినది రాయలేదనీ, రాస్తే సొమ్ము ముట్టలేదనీ, చేసిననేరం చేయలేదనీ, యీవిధముగా వాదనలు అబద్ధమని తెలిసియుండీన్నీ చేయడం, అందుకు తగిన సాక్ష్యము పూటుచేసి తరఖీదుచెయ్యడం, వీటిలో నీచమూ హైన్యమూ లేదూ? వోటు లంచానికన్నా మీ అబద్ధాలఫీజు యేమోస్తరుగా మంచిదో చెప్పండీ!

మన హిందువుల కళ్లతో—అంటే ఆర్యుల కళ్లతోచూస్తే, ఇవన్నీ పాపాలే; పడమటి కళ్లతోచూస్తే బహువిధాలుగా ఉంది. ఈవృత్తి సంగతులు యిన్ని నాకు యెలాగు తెలుసునా? ఆడవాళ్ళకు తెలియనిదేది? మీరు తరుచు అనడమూ లోకులవల్ల వినడమూ రెండుకలిపి చూచుకోండి!

అందుచేత మీనీతి కబుర్లు మానండి! ఉండగలిగేరా మీరుచెప్పే గాంధీలాగు ఉం

964

ఉండి! లేదా బురదలోకి దిగితే, బురదలలో రంగులు, తేడాలు, చూసేదేమిటి? అన్నీ బురదలే! అంటుకోక మానవు, కంపుకొట్టక మానవు! బురదలోకి దిగినందుకు లాభ ముండాలి! అందుచేత, మీ తెలివి తక్కువ అనండి గాని వోటుకు లంచము పుచ్చుకోవడం నీచమనకండి. అంతదాకా యెందుకూ? మీకు రెండువందలరూపాయీలు తాలుకా బోర్డుమెంబరు పనికి యెందుకు ఖర్చు అయినాయి? ఎలాగు ఖర్చు అయినాయి? వోట్లలో మూడువంతులు డబ్బిచ్చి కొన్నవేనా? మీరు యివ్వడం గౌరవమేనా, పుచ్చుకొన్న వాళ్లేనా పాపం? లంచము తిన్న వాడికేనా నేరం? యిచ్చినవాడి కేమీ లేదూ? సానిదానికేనా పాపం, సరసుడికి లేదూ?

"బాగున్నది యీయెలక్షను లెక్చరు, పడుక్కో-సీ"యూ? పడుక్కోండురు గాని తొందరేమిటి? చెత్తనోవలు పట్టుకొంటే మాయమై పోయేనిద్ర నేనొకమాట మాట్లాడేనో లేదో అప్పుడే వచ్చి యెంతట్లో వాలుతుంది? పడుక్కో-వచ్చును గాని అసలు సంగతేదో తేల్చండి!—అప్పో సప్పో చేసి యాత్రకు వెళ్ళకతప్పదు: పిల్లల మొక్కులు తీర్చక తప్పదు! ఎన్నేళ్లున్నా ఉండిపోవడమే గాని మరొకనాడు మనకి కలిసివస్తుందా యేమిటి? మీ తాలూకాబోర్డు వోట్లకే మరి రెండువందలు ఖర్చు పెట్టే ననుకోండి! రెండునెలలు పేకాట, బిలియర్డులు, సిగరెట్లు,- మానేసి నాననుకోండి! బయలుదేరండి! ఇంతకీ మా అమ్మను గదా మీరు టిక్కెట్టు పెట్టితీసి కెళ్ళలేరు? పోనీయండి, మీరే పిల్లలకు సంరక్షణచేస్తూ ఉందురు గాని, యాత్రచేసికొని వెళ్ళిపోవద్దాము!

'మాఅమ్మను తీసికొని వెళదామా,' అంటారా? చెప్పేదేమిటి, ఆవిడ సాయము దైవసాయమే! ఆవిడకు కూడా చాకిరీ చెయ్యాలి! పిల్లలిని ఎత్తుకోదు, వంటవండదు, పిల్లలకి అన్నంపెట్టదు, పాలుపొయ్యదు, మరెందుకు ఆవిడ సాయం? కావలస్తే దారికడాకూ పోటుకుమాట లాడడానికిపనికివస్తుంది. అదీగాక ఆవిడ బయలుదేరితే అప్పగారు కూడా తప్పదుకదా! సూదితో దారం బొంత కలంకారం! ఇక మరి చెప్ప నక్కర్లేదు, యాత్ర సౌఖ్యమూ, యాత్రఫలమున్నూ! వాళ్లిద్దరూ నన్ను నోట్లో పడేసుకొన్న తర్వాత యాత్ర అయితేనేమి, కాకపోతేనేమి? మొక్కులు తీరితేనేమి, తీరకపోతేనేమి? అయితే వాళ్లకు మాత్రము మీరు టిక్కెట్లు పెట్టనక్కర్లేదా?—మరి ఆసొమ్ములో సగంపెడితే మాఅమ్మని తీసికెళ్లవచ్చునే! ఏబాధా లేకుండా చెప్పిన పనల్లా చేసి చెయ్యికడిగి అన్నం పెడుతుంది! దాన్ని మానేడ మేమిటి? వీళ్లని తీసికెళ్ళడ మేమిటి? స్వర్గానికెళ్లి నా సవతిపోరు తప్పింది కాదన్నట్లు!—వాళ్ళతో యాత్ర చాలుచాలు! బయలుదేరితే మా అమ్మతో బయలుదేరుదాం; లేకపోతే మనమే వెళ్లిపోదాం—మనకు సాయమెందుకు? మీరే ఉంటారు అన్నింటికీ!